# పాడైపోయెను గూడు

రాత్రి పదయింది. తలుపు చప్పుడు విని టి.వి చూస్తున్న కళ్యాణి ఒక్కుదుటన లేచి తలుపు తీసింది.

'ఇంతాలస్యమైందే' అంది భర్త చేతిలోవున్న బ్రీఫ్‌కేస్ తీసుకుంటూ.

'ఆఫీసులో పనుంది' ముక్తసరిగా చెప్పి గదిలో కెళ్ళిపోయాడు. నెలరోజులనుంచి ఒకటే ప్రశ్న అదే జవాబు.

భోజనం కూడా మౌనంగానే పూర్తి చేసారిద్దరూ.

'ఒకసారి మేడమీదికి రా. నీతో మాట్లాడాలి' అన్నాడతను. ఏనాడూ భర్తని అంత సీరియస్‌గా మును పెప్పుడు చూడలేదు కళ్యాణి. ఏదో అధైర్యం మనసుని పట్టి పీడించింది. ఏం ఫరవాలేదు అని మనసుకి సర్దిచెప్పుకుని, టేబుల్ సర్ది, టి.వి. ఆపేసి పైకెళ్ళింది.

చీకటిగా మసక మసకగా ఉందక్కడ.

'కళ్యాణీ' అన్నాడు నెమ్మదిగా.

'ఊఁ'

'మనిద్దరి పెళ్ళయి పదేళ్ళయింది కదూ'

'అవును'

'ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. ఆ స్పర్శ ఆమెకి ధైర్యాన్నిచ్చింది.

'పదేళ్ళ క్రితం ఈ చేతిని నా చేతుల్లోకి తీసుకుని నన్ను నమ్మమన్నాను. నమ్మావు. అవునా?

'ఇప్పుడవన్నీ ఎందుకు?'

'తగిన కారణం ఉంది కనుకనే చెప్తున్నా. నేను ఎంతోమథన పడిన వెనకగానీ ఏ నిర్ణయానికి రాను. ఆ విషయంనీకు తెలుసుగా'

'ఊఁ'

'ఈ రోజు నేను చెప్పబోయే విషయం నీకు చాలా బాధ కలిగిస్తుంది. నాకు బాగాతెలుసు. కానీ నాకు వేరే దారి లేదు. నాకు నీ అండ కావాలి.'

కాలికింది భూమి కదులుతున్నట్లయింది. ఏం చెప్పబోతున్నాడు? చెయ్యి వదిలించుకోబోయింది. అతను వదల్లేదు. గట్టిగా పట్టుకున్నాడు.

'నాకు నువ్వే ప్రామిస్ చేయాలి. నేను చెప్పేది విన్నతర్వాత నువ్వు తొందర పడవని, తొందరపడి ఎటువంటి నిర్ణయానికి రావని నాకు మాటివ్వాలి'

'మీరేం మాట్లాడుతున్నారు?'

'ముందు నువ్వు ఏం అఘాయిత్యం చెయ్యనని మాటివ్వాలి?'

'అసలు దేనికిదంతా' సహనం కోల్పోతోందామె.

'నిన్ను హర్ట్ చెయ్యడం నాకు చాలా బాధగాఉంది. కానీ తప్పదు నీకు చెప్పితీరాలి. ఎందుకంటే నాకు నిన్ను మోసం చేయాలని లేదు. నేనువేరే పెళ్ళి చేసుకుంటున్నాను' అతని గొంతు బొంగురు పోయింది.

అతని గుప్పిట్లో ఆమె చెయ్యి బిగుసుకుపోయింది. మళ్ళీ పెళ్ళా? ఇప్పుడు తనకేమైందని? అతని వయస్సు ముప్పయి ఎనిమిది, తనకి ముప్పయి నాలుగు. ఇప్పుడు మళ్ళీ పెళ్ళా. ఇది అబద్ధం అని గట్టిగా గొంతు చించుకు అరవాలనిపిస్తోంది. కానీ గొంతు పెగల్లేదు. ఎంత ప్రయత్నించినా మాట రాలేదు. శిలలా నిల్చుందంతే.

'మాట్లాడు కళ్యాణీ. నన్ను తిట్టు, కొట్టు. అట్లా ఊరికే ఉండకు. నేను భరించలేను' తను మాట్లాడకపోతే భరించలేడా? మరి అతను చెప్పిన వార్త విని తను భరించాలా.

'కళ్యాణి నా బాధవర్థం చేసుకో. నాకు పిల్లలంటే ఎంతిష్టమో నీకు తెలుసుగా. పదేళ్ళయినా మనకు సంతాన ప్రాప్తిలేదు. మా అమ్మ పోరు పడ్లేక ఒకసారి డాక్టర్ దగ్గరికెళ్ళాం గుర్తుందా. ఆ రిపోర్టులన్నీ చూసి నీకు పిల్లలు పుట్టరని డాక్టర్ చెప్పింది. నువ్వు బాధపడతావని నీకా విషయం చెప్పలేదు. కానీ మా అమ్మకి తెలిసిపోయింది. అప్పట్నుంచి ఒకటే గొడవ చేస్తోంది. అందుకని...' బాధగా నుదురు రుద్దుకున్నాడతను.

అంటే తనకి పిల్లలంటే ఇష్టంలేదా? ఆ పిల్లలకోసం అతను చెప్పిందల్లా చేసింది. ఆపరేషన్ చేయించుకుంది. ఇచ్చిన మందులన్నీ మింగింది. అత్తగారు మొక్కమన్న బాబాకల్లా మొక్కింది. తాయెత్తులు కట్టించుకుంది. తనకి వీటన్నిటిమీదా నమ్మకం లేదు. అత్తగారితో పోట్లాడి భర్త తనను బాధపెట్టడమెందుకని ఊరుకుంది.

వాళ్ల గురించి ఎంతాలోచించింది తను ఇప్పుడు...

'చెప్పు కళ్యాణీ! నన్నేం చెయ్యమంటావు?' స్పృహలోకొచ్చిందప్పుడు.

'నా అభిప్రాయం అడగాల్సిన సమయం ఇదికాదు. ముందే నన్నడిగుంటే నా అభిప్రాయం తెలుసుకునేవారు. ఇప్పుడు చెప్పాల్సింది మీరే. చెప్పండి నన్నేం చెయ్యమంటారు? మీ ఇద్దరినీ కూర్చో పెట్టి పెళ్ళిచేసి అక్షింతలు వెయ్యమంటారా? శుభలేఖలు అందంగా ప్రింట్ చేయించి ఇంటింటికీ తిరిగి మా ఆయన పిల్లల కోసం మాత్రమే రెండో పెళ్ళి చేసుకుంటున్నాడని చాటింపు వెయ్యనా. చెప్పండి ఏం చెయ్యాలో..!'

'స్టుపిడ్' అరిచాడతను కోపంగా. చీకట్లో అతని కళ్ళు తళతళా మెరుస్తున్నాయి.

'ఎందుకాగాలి చెప్పండి? కేవలం పిల్లలు పుట్టనంత మాత్రం పదేళ్ళ మన వైవాహిక జీవితాన్ని మరిచి పోయి రెండోపెళ్ళి చేసుకుంటారా? మీలో ఇటువంటి పతనం ఎందుకొచ్చింది చెప్పండి. అదే తప్పు మీలోనే ఉందని డాక్టరంటే మీరు నాకు మళ్ళీ పెళ్ళి చేస్తారా చెప్పండి?

'చచ్చినా చెయ్యను. ఏ ఆడదీ ఒప్పుకోదు కూడా. నేను పెళ్ళి చేసుకున్నంత మాత్రాన

గొల్లపూడి శైలజ

నిన్ను వదలి పెడతానని అనుకోవద్దు. నాకును వ్వుకూడా కావాలి' ఇదో బలహీనత అంతే.

'బలహీనతా? అతని జుట్టు పీకాలనిపించింది. ప్రతీకారవాంఛ రగిలింది. చెడామడా తిట్టాలనుకుంది. గుండెల్లో మంట, ఒళ్ళంతా కారం రాచినట్లు మంట. చెయ్యి విదిలించుకుని వెళ్ళబోయింది.

'ప్లీజ్ ఆగు. ఇంకా మాట్లాడాల్సింది చాలా ఉంది'

'ఇంకా ఏముంది. చెప్పాల్సిందంతా చెప్పారుగా మీక్కావాలంటే నేను ఈ క్షణమే ఇల్లు విడిచి వెళ్ళిపోతాను. నాకు ఎటువంటి అభ్యంతరమూ లేదు'

'నువ్వెక్కడికీ వెళ్ళఖ్ఖర్లేదు ఇక్కడే ఉండు ప్లీజ్'

'చచ్చినా ఉండను. నేను ఇటువంటివి అసలు భరించలేను'

'ఆ అమ్మాయి ఈ ఇంట్లో ఉండదులే కళ్యాణీ. విడిగా ఏర్పాట్లు చేశాను. నేనే వెళుతూ వస్తూ ఉంటాను. నువ్వీ ఇల్లు విడిచి ఎక్కడికీ వెళ్ళక్కర్లేదు.

'నేను వెళ్ళిపోతాను' మొండిగా అంది కళ్యాణి.


'నేను చెప్పేది వినిపించుకో. ఈ పెళ్ళి కేవలం మా అమ్మకోసం. సంతానం కోసమేగా ఈ తంటాలన్నీ. నువ్వు చెప్పినట్లు ఎవర్నయినా దత్తత తీసుకున్నా వారిలో ప్రవహించేది నా రక్తం కాదుగా. అలాంటి వారిమీద మనకి ప్రేమెలా కలుగుతుంది. నువ్వు తొందరపడి మన పదేళ్ళ అనుబంధాన్ని కూలతోయకు. లోకులకి నేనెప్పుడూ భయపడను. నా బాధంతా నీ గురించే..!'

ఇంకా అతని మాటలు పూర్తి కానేలేదు. చీకట్లో మెట్లన్నీ వేగంగా దిగి గదిలో కొచ్చేసింది. అంధకారంలోకి నడిచి పోతున్నట్లు, పాతాళలోకానికి జారిపోతున్నట్లు, మట్టూ ప్రపంచం కూలిపోతున్నట్లు అంతాశూన్యంగా ఉంది.

మంచంమీద పడుకోలేక పోయింది. కూర్చోలేక పోయింది.నిల్చోలేకుండాఉంది. ఈ గోడలు ఈ ఇల్లు అన్నింటినీ ముక్కలుముక్కలుగా చేసి ఎక్కడికైనా పారిపోవాలి. మేడ మీదున్నతని జుట్టుపీకి, కళ్ళు పీకి, నలిపి, పీకనులిమి ముక్కలుచేసెయ్యాలి. ఏ చేతుల్తో అయితే అతన్ని ప్రేమగా దగ్గరికి తీసుకుందో ఆ చేతుల్తోనే అతని పీక నులిమెయ్యాలి.


తనని నిలువెల్లా తడిమిన చేతుల్తో ఆ పిల్లని కూడా తడుముతాడా? ఆ భావన ఆమెని పిచ్చిదాన్ని చేసింది. తను చచ్చిపోతే అతను విచారిస్తాడా? ఏం విచారించడు. ఇంకా హాయిగా ఉంటాడు. అలా వీల్లేదు. చావకూడదు. తనను ఇంతగా రంపపుకోతకు బలిచేసి తన ప్రేమనీ, తన నమ్మకాన్నీ, బూడిద చేసిన ఇతన్ని ఏం చెయ్యాలి? వళ్ళంతా జ్వరమొచ్చినట్లు సలసలా కాగిపోతోంది. నోరెండి పోయింది. ఫ్రిజ్ తీసి ఓ సీసా నీళ్ళు గడగడా తాగింది.

ఏదో ఒకటి చెయ్యాలి. తెల్లవారనివ్వకూడదు. మళ్ళీ అతని మొహం చూడాలి. ఇంకా అతని మొహం చూళ్ళేదు. అందుకనే పడుకోవాలి. బాగా నిద్రపోవాలి. విశ్రాంతి కావాలి.



నిద్రమాత్రలు మూడేసుకుని పడుకుంది.

ఏదీ శాశ్వతం కాదు. ఈ ప్రేమలు మమతలు శాశ్వతం కాదు. ఎంతగా ప్రేమించిందతన్ని? అణువణువు తన స్వంతం చేసేసుకుంది. పల్చగా వుండే ఆ చెక్కిళ్ళు తనవే. వత్తుగా నల్లగా ప్రతిరాత్రి ప్రేమగా వేళ్ళు జొనిపి ఆడుకున్న జుట్టు తనదే. ఎన్నోసార్లు గుండెలకి హత్తుకున్న ముఖం, మరుగ్గా చూసే ఆ కళ్ళు అన్నీ తనవే. కానీ ఇప్పుడవన్నీ మరోవ్యక్తి స్వంతం చేసేసుకుంటుంది.



అతనే తనలోకం అనుకుంది. అతడు తప్ప మరోలోకం తనకి తెలీదు. తన వ్యక్తిత్వాన్ని కూడా మర్చిపోయింది. అందుకే తనీనాడు ఏకాకి అయిపోయింది. ఏం చెయ్యాలి. ఈ ఒంటరి తనంలో తనకెవరు తోడుంటారు?

వున్నట్టుండి ఆనంద్ గుర్తొచ్చాడు కళ్యాణికి. కాలేజీలో చదువుకునే రోజుల్లో పిచ్చిగా తనవెంట పడి తిరిగేవాడు. తను లెక్క చేయలేదు. అది తన భర్తకి కూడా తెలుసు. తన పెళ్ళి అయిన తర్వాతే అతడి పెళ్ళయింది. అతని భార్య క్యాన్సర్‌తో రెండేళ్ళ క్రితమే పోయింది. అతడికిద్దరు పిల్లలు. ముత్యాల్లా ఉంటారు. వారిలో ఒకళ్ళనే తను దత్తత తీసుకుందామనుకుంది. ఇప్పుడింక ఆ అవసరం లేదు. తనే వాళ్ళకి తల్లిగా ఆనంద్ దగ్గరికెళ్ళి పోతుంది. తనభర్తకంటే ఆనందే గొప్పవాడు. అవును నిశ్చయంగా గొప్పవాడు. ఎందుకంటే అతడు మళ్ళీ పెళ్ళిచేసుకోలేదు. చపలచిత్తం లేదు. బలహీనతలు లేవు. అందుకే తను ఆనంద్ దగ్గరికెళ్ళి పోతుంది. లోకులకి భయపడని దాంబికాలు పలికాడుగా ఏమౌతాడో చూద్దాం.

• • • • •

సూట్‌కేసులో బట్టలు సర్దుకుంది. తన పుట్టింటివాళ్ళిచ్చిన నగలు మాత్రం తీసుకుంది. అతను కట్టిన నల్లపూసలు, మంగళసూత్రం తీసేసింది. మట్టెలు కూడా తీసింది. తన బ్యాంక్ పాస్ బుక్ తీసుకుంది. ఇంకేమైనా మర్చిపోయానేమో అని గుర్తు చేసుకుంది. మళ్ళీ ఇంకోసారి మంగళసూత్రం కేసి చూసింది. ఒకప్పుడు పాత సూత్రం తీసి కొత్తడిజైను ది చేయించా పెట్టుకో అనిఅతడంటే చాలా ఫీలయింది ఆ మంగళసూత్రం గొలుసు తీయడానికి. ఇప్పుడా ఫీలింగే కలగడం లేదు. అవును అప్పుడతని మీద ప్రేముండేది. ఇప్పుడు కేవలం అసహ్యమే మిగిలింది.

తెలతెలవారుతూనే లేచి స్నానం చేసి, తయారై సూట్‌కేస్ పట్టుకుని పేపర్ చదువుకుంటున్న భర్తకి చెప్పింది 'వెళుతున్నాను' అని.

'ఇవిగో తాళం చేతులు, ఇవిగో మంగళసూత్రాలు'

అదిరిపడ్డాడా సూత్రాలని చూసి. 'ఎక్కడికి'వింతగా చూసాడామెవంక

'ఆనంద్ దగ్గరికి' నిశ్చలంగా చెప్పింది.

'వాట్—నీకేమన్నా మతిపోయింది?'

'అవును. పోయింది'

'నాకిష్టం లేదు. నువెళ్ళడం అందులోవాడి దగ్గరికి'

'అవును. ఆనంద్ దగ్గరికెళ్ళి నేను సంతోషంగా ఉండటం మీకిష్టం లేదు. మా అమ్మా వాళ్ళ దగ్గరికెళ్ళి నా మొగుడు నన్ను తరిమేశాడు అని ఏడిస్తే మీకానందం. వద్దు మళ్ళీ పెళ్ళి చేసుకోకండి ప్లీజ్ అని మీ కాళ్ళు పట్టుకుని ఏడిస్తే మీకానందం. మీ ఇద్దరూ పెళ్ళి చేసుకుని మీ ప్రేమఫలితాన్ని ఆ అమ్మాయి బరువుగా మోస్తూ తిరుగుతుంటే అది చూసి ఆ అదృష్టం నాకు లేదే అని నేనేడిస్తే మీకానందం. అవునా?' బరస్ట్ అయిపోయింది కళ్యాణి.

'వెళ్ళువెళ్ళు. వాడినీ, నీ ఉద్యోగాన్నీ చూసుకుని ధీమాగా బయలుదేరావు. వాడు నాలుగురోజులుంచుకుని తర్వాత తన్ని తగలేస్తే నువ్వే మళ్ళీ రోడ్డుమీద పడ్తావు. గుర్తుంచుకుని మరీవెళ్ళు.' కసిగా వున్నాయా మాటలు.

ఆశ్చర్యపోయింది కళ్యాణి. మాట్లాడేది తన భర్తేనా. తనకు తలనొప్పన్నా, కాళ్ళు నొప్పన్నా విలవిల్లాడి పోయిన భర్తేనా. నమ్మలేనట్టుగా చూసిందతని వైపు. ఎంత అసూయాపరుడు. తను ఇంట్లోనే ఉంటే అప్పుడప్పుడు వచ్చి చూసిపోతాట్ట. ఇల్లు వదిలి పోతే రోడ్లు పట్టుకు తిరగాల్ట.

'మీరు మాత్రం ఏం తక్కువా? పిల్లలు పుట్టలేదని ఇప్పుడు నన్ను వదిలేశారు. రేపు ఆ పిల్లకి కూడా పిల్లలు పుట్టకపోతే వదిలెయ్యరని ఏమిటి గ్యారంటీ? అప్పుడు ఆ అమ్మాయి గతీ రోడ్డేగా? ఎవరికైనా సంతానం ముఖ్యం కాదు. పిల్లలు ఇప్పుడుంటారు. రెక్కలొచ్చాక ఎగిరిపోతారు. వాళ్ళకి అవసరమైనంతవరకు మిమ్మల్ని ఉపయోగించుకుంటారు. ఆస్తిపంపకాలవరకు కలిసుంటారు. మీ దగ్గర డబ్బులేకపోతే మీ గొంతులో గుక్కెడు నీళ్ళు కూడా పొయ్యరు. కష్టంలోనైనా, సుఖంలోనైనా కలిసుండేది భార్యే. కడదాకా మీతో కలిసివచ్చేది కూడా భార్యే. ఆ విషయం మీరు తెలుసుకుంటే మంచిది. అంతేకానీ అమ్మకోసమొక పెళ్ళి, పిల్లల కోసమొకపెళ్ళి, ఆడపడుచుకోసం మరో పెళ్ళి చేసుకుంటూ మీ విలువను దిగజార్చుకోకండి. సెలవ్'

వెళ్ళిపోయింది కళ్యాణి.

●